క్లుప్తంగా

రోడ్డు భద్రతపై ర్యాలీలు



వడ్డాదిలో అవగాహన కల్పిస్తున్న ఐకేపీ సిబ్బంది

బుచ్చెయ్యపేట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పి.భీమవరం, ఆర్.శివరాంపురం,వడ్డాది,కేపీ అగ్రహారం ,కొమళ్లపూడి గ్రామాల్లో డ్వాక్రా సభ్యులు ర్యాలీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని,ఇద్దరు మాత్రమే ప్రయాణం చేయాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మండల ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం బాలరాజు, ఐకేపీ సిబ్బంది ర్యాలీల్లో పాల్గొన్నారు.

తీర్థాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న రూరల్ సీఐ రమణయ్య

నాతవరం: గ్రామ దేవతల తీర్థమహోత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణతో మాట్లాడి మండలంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఫ్రెండ్లీ పోలీసు విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ప్రత్యేక నిఘా పెట్టేందుకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. సారా నిర్మూలనకు గ్రామాల్లో దాడులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ

చోడవరం రూరల్: కానిస్టేబుల్ ఎంపిక రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు చెప్పారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా పది గంటలకు ముందే కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. అభ్యర్థులు కేవలం హాల్ టికెట్, బాల్‌పాయింట్ పెన్, ఏదైనా ఒక గుర్తింపు కార్డు మాత్రమే తీసుకుని రావాలన్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న ఎంఈవో మధుమూర్తి

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో టి.మధుమూర్తి సూచించారు. మండలంలో ఎ.భీమవరం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు, తర్రా శేషు పాల్గొన్నారు.

నేడు గరిశింగిలో 'గడప గడపకు'

దేవరాపల్లి: గరిశింగి గ్రామ సచివాలయం పరిధిలోని గరిశింగి, కొత్తూరు, దొర్రి చెరువు, కించుమండ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బి.సింగవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు

చీడికాడ: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు తెలిపారు. జైతవరం సచివాలయం పరిధిలో గల బి.సింగవరంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు గురించి తెలుసుకున్నారు. గ్రామంలో చెల్లమ్మపేరంటాలు అమ్మవారిని, వేణుగోపాలస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు, అదనంగా 20 వేల లీటర్ల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఐదుగురికి ఇళ్ల పట్టాలు, 23 మందికి గృహాలు మంజూరు చేశారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేసేందుకు రూ.36 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేశారు. విశాఖ డెయిరీ ఆర్థిక సాయంతో గ్రావెల్ రోడ్డులు నిర్మించనున్నట్టు చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను మార్చాలని, అవసరమైన చోట కొత్తవాటిని ఏర్పాటుచేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద జానకీరామ్, సర్పంచ్ శరగడం సన్యాసినాయుడు, ఎంపీడీవో జయప్రకాశ్‌రావు, తహసీల్దారు బి.వి.రాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, పార్టీ సీనియర్ నాయకులు యర్రా అప్పారావు, సుంకర శ్రీను, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కురచా కుమారి, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, స్థానిక నాయకులు శరగడం జయరామ్, బి.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
– ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చోడవరం 1, 5 సచివాలయాల పరిధిలో వెలమవీధి, చందకవీధి, విశ్వబ్రాహ్మణ వీధుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఆయా వార్డుల్లో పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఓటీఎస్ పథకంలో ఇంటి హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బండారు సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, పంచాయతీ ఈవో నారాయణరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, వార్డు మెంబరు పసుమర్తి సంతోష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వేచలపు ప్రకాష్, జిల్లా ప్రతినిధి ఉప్పలబాబు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను అధిగమించాలి



సమీక్షలో మాట్లాడుతున్న రోజారాణి

నాతవరం: కలెక్టరు ఆదేశాల మేరకు ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను అధిగమించాలని ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి తెలిపారు. మండలంలో చెర్లోపాలెం, జిల్లుడుపూడి, మర్రిపాలెం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య గణనీయంగా పెంచి తేసే లక్ష్యాన్ని అధిగమించవచ్చని చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఈవోపీఆర్‌డీ ప్రేమలీల తదితరులు పాల్గొన్నారు.

చిత్తులాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు

గొలుగొండ: కొంకసింగి గ్రామంలో చిత్తులాట (కాయిన్‌గేమ్) ఆడుతున్న ఇద్దరిని కృష్ణదేవిపేట ఎస్‌ఐ సూర్యనారాయణ శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.300 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కార్మిక మహాగర్జన వాల్ పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

చోడవరం రూరల్: విశాఖలో నిర్వహించనున్న కార్మిక మహా గర్జనను విజయవంతం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పిలుపు నిచ్చారు. కార్మిక మహాగర్జన వాల్‌పోస్టర్‌ను శనివారం వారిక్కడ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా రక్షించుకోవడం కోసం జరుపతలపెట్టిన కార్మిక గర్జనకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ నెల 23న చోడవరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 24న నర్సీపట్నం ఆర్డీవో కార్యాయలం, 25న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నేమాల హరి తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి



నగదు అందజేస్తున్న ఎస్టీవో సత్యఈశ్వర గణేష్

మాకవరపాలెం: సామాజిక పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండల పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు కోసూరు రామారావు అన్నారు. మండలంలోని తామరంలో శనివారం నిర్వహించిన పింఛనుదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం నర్సీపట్నం సబ్ ట్రెజరీ అధికారి సత్యఈశ్వరగణేష్ పింఛనుదారుల నుంచి లైఫ్‌సర్టిఫికెట్లను స్వీకరించారు. త్వరలో ఈకేవైసీ పూర్తి చేస్తామన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన రామరక్షణ సంఘం సభ్యులుగా ఉంటూ మరణించిన పింఛనుదారుల కుటుంబాలకు రూ.44 వేల ఆర్థిక సాయాన్ని ఎస్టీవో అదించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రంగరాజు, అచ్చేశ్వరరావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



లబ్ధిదారులు ప్రభుత్వ రాయితీల గురించి వివరిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మాడుగుల: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్మాణాలు పూర్తి చేసిన వారికి వెంటనే చెల్లింపులు చేస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తెలిపారు. జాలంపల్లి పంచాయతీ ఎల్.కొత్తపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన హౌసింగ్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్లలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీనా కుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ, తహసీల్దార్ పి.వి.రత్నం, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



కాలిపోయిన ఫ్రిజ్

రావికమతం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కిత్తంపేట గ్రామానికి చెందిన వీఆర్‌పీ శానాపతి శ్రీను ఇంట్లో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. నిత్యావసరాలతో పాటు గృహోపకరణాలు,ధాన్యం, రూ.70వేల నగదు దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు శ్రీను తెలిపాడు.

సనాతన హిందూ ధర్మాన్ని పాటించండి

కోటవురట్ల: సనాతన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ సూచించారు. జల్లూరు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ధనుర్మాసంలో మేలుకొలుపు కార్యక్రమాల ద్వారా వచ్చిన విరాళాలతో అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం శ్రీరామ భజన బృందం సభ్యులు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పాటించడం ద్వారా కుటుంబ వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు.

ప్రజలు ఛీకొట్టినా పవన్‌కు బుద్ధి రాలేదు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

నక్కపల్లి : రెండు చోట్ల పోటీ చేసి ఒక్క చోట కూడా గెలవలేని పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆరాట పడడం సిగ్గుచేటని పాయకరావుపేట ఎమ్మెల్యే, అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు ఆక్షేపించారు. శనివారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ సినిమాలకే తప్ప రాజకీయాలకు పనికిరాడన్నారు. అభిమానులు ఆయనను సినిమా నటుడిగానే చూస్తున్నారన్నారు. అందుకే ప్రజలు పవన్ కల్యాణ్ పోటీ చేసిన భీమవరం, గాజువాకలలో ఓడించారన్నారు. అయినా పవన్‌కల్యాణ్‌కు సిగ్గులేదన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదన్నారు. పార్టీ పెట్టిన వెంటనే ఇద్దరు ఎంపీలను, 15 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారని, 2014లో జరిగిన ఎన్నికల్లో 65 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని ప్రతిపక్ష స్థానంలో నిలిచారన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్ర చరిత్రను తిరగరాసి 151 మంది ఎమ్మెల్యేలను 21 మంది ఎంపీలను గెలిపించుకుని రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన జగన్ మోహన్ రెడ్డి పేరు తలచే అర్హత కూడా పవన్‌కల్యాణ్‌కు లేదన్నారు. జెండా తప్ప ఎజెండా లేని జనసేన పార్టీ అధికారంలోకి రావడం కల్ల అన్నారు. పవన్‌కు దమ్ముంటే ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఒంటరిగా పోటీ చేయాలన్నారు. చంద్రబాబునాయుడికి పదవీ వ్యామోహం తప్ప ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పందెంలో దౌడుతీస్తున్న గిత్తలు



రావాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



విజేతకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ బాబూరావు

మాడుగుల రూరల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల తీర్థాలను ఘనంగా నిర్వహించారు. కె.జె.పురంలో దుర్గాలమ తీర్థం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకమ పూజలు, తోడపెద్దు సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పాలకుర్తి కిశోర్, కార్యదర్శి రాంజీ తదితర్లు పర్యవేక్షణలో తీర్థం నిర్వహించారు.

మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం మరిడిమాంబ తీర్థాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం ఉత్సాహంగా జరిగింది.

రావాలమ్మ తీర్థం

కె.కోటపాడు : రావాలమ్మ అమ్మవారి తీర్థాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కె.కోటపాడులో గల అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించేందుకు కింతాడ, కె.కోటపాడు, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం, దాలివలస గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ తదితరులు ప్రత్యేక పూజలు జరిపారు.

దేవరాపల్లి: బోయిలకింతాడలో మరిడిమాంబ అమ్మవారి తీర్థాన్ని పురస్కరించుకుని శనివారం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీల్లో వావిలపాడు గండి వెంకటరావు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో 18 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు ప్రారంభించారు. ద్వితీయ స్థానంలో ఎం.కొత్తపల్లి నంబారు గాయత్రీ ఎడ్లు, తృతీయస్థానం కూంద్రం శ్రీమరిడిమాంబ ఎడ్లు, నాల్గో స్థానంలో కలగాడ పోలుపర్తి రామునాయుడు ఎడ్లు, ఐదో స్థానంలో చుక్కపల్లి మురుగుతి హరికృష్ణ ఎడ్లు, ఆరోస్థానంలో వల్లంపూడి సిద్ధివినాయక ఎడ్లు, ఏడోస్థానంలో సింహాద్రిపురం శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఎడ్లు, ఎనిమిదో స్థానంలో నర్సాపురం మోదమాంబ ఎడ్లు నిలిచాయి. వీరికి వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.9వేలు, రూ. 6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.1500, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేశారు. అంతకు ముందు మరిడిమాంబ అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకొని పూజలు జరిపారు. కొత్తపెంటలో పైడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు తెలిపారు.

లక్ష్మీపురంలో నో బ్యాగ్ డే



సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

చోడవరం రూరల్: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే పాటించారు. సచివాలయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సచివాలయ సందర్శనను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొల్లు శ్రీనివాసరావు, సహ ఉపాధ్యాయుడు రవికుమార్, పంచాయతీ కార్యదరి మోదారావు, విద్యా కార్యదర్శి ప్రసాద్‌లు విద్యార్థులకు సచివాలయం గురించి వివరించారు.

కుసుర్లపూడిలో..

రోలుగుంట: మండలం కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం న్యో బ్యాగ్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అప్పన రాంబాబు విద్యార్థులకు కృత్యధార బోధన చేశారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం అచ్యుతం పర్యవేక్షించారు.



కుసర్లపూడిలో కృత్యధార బోధన చేస్తున్న సోషల్ టీచర్ రాంబాబు

181 మందికి వైద్య సేవలు



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జాహ్నవి

కె.కోటపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఎ.కోడూరులో శనివారం 181 మందికి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా లంకవానిపాలెం వైద్యాధికారి జాహ్నవి మాట్లాడుతూ గర్భిణులు.. వైద్యుల సూచనలు పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, రమణ, ఏఎన్‌ఎం సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఉషోదయ కాలేజీలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీటీవో ఎం.వీర్రాజు మాట్లాడుతూ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, విద్యాసంస్థల డీన్ వాసు తదితరులు పాల్గొన్నారు.

వల్లభేశ్వరునికి ఘనంగా పూజలు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీ వల్లభేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గడిచిన రాత్రి భారీ తీర్థ మహోత్సవం అనంతరం తీరాన్ని ఆనుకుని కొండపై వేంచేసి యున్న శ్రీ వల్లభేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కొందరు మత్స్యకారులు ఎర్రజెండాను స్వామి గుడివద్దకు తీసుకువచ్చి మొక్కుగా సమర్పించుకున్నారు. సందడి వాతావరణంలో స్వామి జాతర నిర్వహించారు. ఈ జాతరను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మునగపాక: ధాన్యంకొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు కోరారు. శనివారం ఆయన మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించా రు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, పీఏసీఎస్ చైర్ పర్సన్ కోనపల్లి రామ్మోహనరా వు పాత పద్ధతి ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లర్ల వద్దకు వెళ్లే పద్ధతి ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. వీఏఏ కళ్యాణి రవిరాజ్ పాల్గొన్నారు.